క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

సాలూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం ఉదయం వేలం వేయనున్నట్లు రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి శుక్రవారం తెలిపారు. నాలుగు చక్రాల వాహనం ఒకటి, 19 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలకు నిర్వహించే వేలంపాటలో ఔత్సాహికులు పాల్గొని, వాహనాలను సొంతం చేసుకోవాలని కోరారు.
సీతానగరం: మండలంలోని వివిధ ప్రాంతాల్లో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ కె.నీలకంఠం శుక్రవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 27వ తేదీన జరిగే వేలంపాటలో 11 ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోను వేలం వేయనున్నామని, ఔత్సాహికులు వేలం పాటకు హాజరై, తమకు నచ్చిన వాహనాలను దక్కించుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



చీపురువలసలో నిర్మించిన రిటైనింగ్ వాల్ నాణ్యతను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: పాచిపెంట, సాలూరు మండలాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. అన్నంరాజువలస పంచాయతీలో దాదాపు రూ.9.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టగా, చీపురువలస గ్రామంలో కొండ నుంచి వస్తున్న నీటిని మళ్లించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించారు. అలాగే పాచిపెంట మండలంలోని పనుకువలస పంచాయతీలో సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పీటీజీ గ్రామాల్లో సీసీడీపీ గ్రాంటు ద్వారా చేపట్టిన ఆయా నిర్మాణాలను చూసిన ఆయన పనుల్లో నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. పీఓ వెంట ఐటీడీఏ డీఈ మణిరాజ్, ఏఈలు సంతోష్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వరి ఉభాలు



చెల్లన్నాయుడువలస వరినాట్లు వేస్తున్న మహిళలు

సీతానగరం: మండలంలోని బుడ్డిపేట, బూర్జ, చెల్లన్నాయుడువలస, లక్ష్మీపురం, వెంకటాపురం, చినబోగిలి, పెదంకలాం, కృష్ణారాయపురం గ్రామాల్లో వరి ఉభాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉదయం నుంచే మహిళా రైతులు పొలాలకు వెళ్లి, ఉభాలు వేయడంలో నిమగ్నమవుతున్నారు. కలుపు నివారణకు వరినాట్లు వేసిన నాటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

యువతికి సాయం



అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి సాయమందిస్తున్న నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి పంచాయతీ రుషిణికాలనిలో తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన బిడ్డిక మణి అనే గిరిజన యువతికి వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి నిమ్మక గోపాల్ (గుమ్మలక్ష్మీపురం గ్రామం) తన వంతు సాయాన్ని శుక్రవారం అందించారు. ఈనెల 20న సాక్షి దినపత్రికలో మూడేళ్లుగా మంచానికే పరిమితం అనే శీర్షికతో వచ్చిన కథనానికి చలించిన గోపాల్ శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి వెస్ట్రెస్ సీటర్, వాకర్‌తో పాటు ఆర్థిక సాయం అందించారు.

డీఎల్‌డీఓ పరిశీలన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

పాలకొండ: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందిని, సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని డీఎల్‌డీఓ గోపాలకృష్ణ సూచించారు. నగరపంచాయతీలోని రామకళామందిర్ వీధి సచివాలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. పౌరసేవలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు.

బోధకులపై భారం తగ్గేలా..

- ఉపాధ్యాయులకు బోధనేతర విధుల నుంచి ఉపశమనం
- ఏపీఎంలకు విద్యారంగం పథకాల అమలు బాధ్యతలు
- ప్రభుత్వ బడుల్లో మరింత మెరుగుపడనున్న బోధన



అంపిలి ప్రాథమికోన్నత పాఠశాలలో బోధనలో నిమగ్నమైన ఉపాధ్యాయుడు

పాలకొండ రూరల్:

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. అన్నివర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అనేక పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తోంది. వాటి పర్యవేక్షణ బాధ్యతల భారం నుంచి ఉపాధ్యాయులను తప్పించి వారిని కేవలం బోధనకే పరిమితం చేయాలని నిర్ణయించింది. పథకాల పర్యవేక్షణకు మండల స్థాయిలో ప్రత్యేక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది. డీఆర్‌డీఏలో సెర్ప్ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు (ఏపీఎం) పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండల విద్యాశాఖాధికారుల సమన్వయంతో వారికి అప్పగించిన విధులను నిర్వర్తించేలా మార్గదర్శకాలను నిర్దేశించింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని 1699 పాఠశాలల్లో

జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఇలా..		
ప్రాథమిక పాఠశాలలు	1320	40084
ప్రాథమికోన్నత పాఠశాలలు	153	15407
ఉన్నత పాఠశాలలు	226	66200
మొత్తం	1,699	1,21,691

1,21,691 మంది విద్యార్థులకు, 6,432 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరనుంది.

ఇరుశాఖల సమన్వయంతో..

విద్యారంగంలోని పథకాల అమలులో జిల్లా, మండల విద్యా శాఖలోని అధికారులకు ఏపీఎంలు సహకరిస్తారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీతో పాటు స్కాలర్‌షిప్‌లు, ధ్రువీకరణ పత్రాల జారీలో సహకారం అందిస్తారు. దీంతో ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గుతుంది. ఇక నుంచి టీచర్లు అకడమిక్, ఇతర నిర్వాహక వ్యవహారాలను మాత్రమే పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న ప్రతి పాఠశాలను ఏపీఎంలు పర్యవేక్షించాల్సి ఉంటుంది.



అన్నవరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

పాఠశాల స్థాయిలో..

ఏపీఎంలు పాఠశాల స్థాయిలో పలు కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. వాటిలో మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్ల పరిశుభ్రత, పాఠశాల సక్రమ నిర్వహణ కోసం బడ్జెట్ కేటాయింపు, నీతిఆయోగ్ సీఎస్ఆర్ ద్వారా మౌలిక వసరుల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు కోసం నూతన జాతీయ విద్యా విధానం ద్వారా పాఠశాలల మార్పు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు ఆన్‌లైన్–డిజిటల్ పాఠాలు అందించడం, తరల్, సాల్ట్, లిప్, సిప్, దీక్షా, జోలీ ఫోనిక్స్ వంటివి ఉన్నాయి.

ఏపీఎంల బాధ్యతలు ఇలా..

- గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపించాలి.
- జగనన్న అమ్మఒడి పథకం కోసం అర్హులైన తల్లులను గుర్తించాలి.
- పాఠశాలలో విద్య, వైద్య, రక్షణ బాధ్యతల పర్యవేక్షణ.
- ఉపాధ్యాయుల జీతాలు, సెలవుల మంజూరు. ట్రెజరీ పనులు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో నిర్వహించే సమీక్షా సమావేశాలకు హాజరు.
- జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలు చేయడం.
- మరుగుదొడ్ల నిర్వహణ, నిధి కార్యకలాపాల పథకాల పర్యవేక్షణ.
- పాఠశాల పరిధిలోని డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్ భద్రత, వాటి పర్యవేక్షణ.
- స్వాతంత్ర్య, గణతంత్ర, ఉపాధ్యాయ, బాలలదినోత్సవాల వంటి కార్యక్రమాల నిర్వహణ.

పనిభారం తగ్గుతుంది



పాఠశాలల్లో సంక్షేమ పథకాల అమలుతీరును ఏపీఎం పర్యవేక్షణకు అప్పగించటం జరిగింది. ఎస్‌హెచ్‌జీ సంఘాల్లో వారికి ఉన్న సఖ్యతతో విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపరిచి డ్రాపౌట్స్ నివారణ, పాఠశాలలో సర్కారు పథకాలను పారదర్శకంగా అమలు జరిగేలా చూడడంతో సమన్వయంతో ముందుకు వెళుతున్నాం. విద్యా వ్యవస్థతోపాటు నూతనంగా ఏపీఎంలు తోడవ్వటంతో ఉపాధ్యాయులకు, డిప్యూటీ డీఈఓలకు, ఎంఈఓలకు కొంత మేరా పనిభారం తగ్గుతుంది.
– ఎస్‌డీవీ రమణ, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

పర్యవేక్షణ చేపడుతున్నాం



ప్రభుత్వ బడుల్లో పథకాల అమలు పర్యవేక్షణకు మండలానికి ఒక ఏపీఎంను నియమించటం జరిగింది. వారికి ఇదివరకే ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ క్రమంలో వారు తమ విధులతోపాటు పాఠశాలల్లో ప్రభుత్వం సూచించిన విధానాల అమలుకు కృషిచేస్తున్నారు. వారు అందించిన నివేదికలను మేము మరోమారు పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నాం.
– పెద్దింటి కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే చర్యలు

- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

పార్వతీపురంటౌన్:

ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన శుక్రవారం కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లోకి ఎక్కించవద్దని సూచించారు. వాహనాల్లోని ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలను చేర్చాలని తెలిపారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. అదనపు పోలీస్ సూపరింటెండెంట్ ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు విలువైనవని, వాహనాలతో రోడ్లపై వెళ్లేవారంతా చాలా జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించవద్దని, ప్రతీ చోట సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం చేశామన్నారు. తప్పు చేసిన వారెవ్వరూ తప్పించుకునేందుకు వీలు లేదన్నారు. జిల్లా రవాణా శాఖాధికారి సి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ డీఎస్పీలు ఎ.సుభాష్, జి.కృష్ణారావు, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.శశికుమార్, ఎస్.రమేష్‌కుమార్, వరప్రసాద్, కాశీరాం నాయక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు మార్చిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పేదల బతుకులు మార్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, ప్రభుత్వ పాలన మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా గృహసారథులు పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో గృహసారథులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ప్రతీ వలంటీర్ పరిధిలోని గృహసారథులు వారికి కేటాయించిన 50 కుటుంబాలకు సంబంధించి, అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, తద్వారా ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. వలంటీర్లు, గృహసారథులతో పాటు సచివాలయ కన్వీనర్లు, నేతలు, కార్యకర్తలంతా కూడా సైనికుల్లా పనిచేసి, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి, మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. అలాగే ప్రభుత్వ చేసే మంచి పనులను వ్యతిరేకిస్తూ ఎల్లోమీడియా, విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం తిప్పటికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్ దివ్య, కో–ఆప్షన్ సభ్యుడు గుంట క్రాంతి, ఏఎంసీ డైరెక్టర్ గోగు గాయత్రి, సీనియర్ నాయకులు ఆదినారాయణ, షేక్ సఫీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో నేల సారవంతం



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ షణ్ముఖరాజు

పార్వతీపురం టౌన్: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నవధాన్యాల సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. పచ్చిరొట్టకు బదులుగా పీఎండీఎస్ నవధాన్యాలు వేసుకోవాలని, ఇలా చేయడం ద్వారా జీవవైవిధ్యం పెరిగి, నేలగుల్లబారుతుందని, తద్వారా వానపాముల సంఖ్య పెరిగి నేలకు బలం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆయన 2024 ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా మార్చి 13వ తేదీన జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన గెలుపు ద్వారా ఉత్తరాంధ్రుల విశాఖ రాజధాని గొంతు వినిపించాలన్నారు. ఇదే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ పరిశీలకులు శోభా హైమావతి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లంతా ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతీ గ్రామంలోని పట్టభద్రుల ఓటర్లను కలిసి, సీతంరాజు సుధాకర్‌కే తొలి ప్రాధాన్యతా ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిందుపూరు గున్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించండి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



పార్టీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థిస్తూ కరపత్రాలు పంచిపెడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని బంగారమ్మ కాలనీలో శుక్రవారం పర్యటించిన ఆయన మార్చి 13వ తేదీన జరిగే ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, ఎన్నికల ప్రచార పత్రాలు పంచిపెట్టారు.



మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలో డీఎస్సీ–98 అభ్యర్థులతో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో డీఎస్సీ పార్వతీపురం నాయకులు రమేష్, ఆర్‌వీ ప్రసాద్, అప్పలనాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బొద్దిడి జంక్షన్(దుమ్మంగి) వద్ద ఉన్న పంచవర్ణేశ్వరస్వామి పంచమరాత్రి మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితులు శివపార్వతులకు ప్రత్యేక పూజలతో పాటు కల్యాణం చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పాడుదమా స్వేచ్ఛాగీతం రచయితకు అభినందనలు



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజీ

పార్వతీపురంటౌన్: పాడుదమా స్వేచ్ఛాగీతం రచయిత గంటేడ గౌరునాయుడును పలువురు అభినందించారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక గిరిజన భవన్‌లో జరిగిన అభినందన సభలో ఆయనను సత్కరించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ పాల్గొని, రచయిత గొప్పతనం ప్రశంసించారు. పాడుదమా స్వేచ్ఛాగీతానికి 30 ఏళ్లు కావడం, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందడంతో పాటు మహారాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదో తరగతి విద్యార్థుల తెలుగు పాఠ్యపుస్తకంలో చేర్చడం చాలా గర్వకారణమన్నారు. ఇవే ఆ గీతానికి ఉన్న గొప్పతనం వివరిస్తాయన్నారు. అటువంటి గొప్ప రచయిత అయిన గౌరునాయుడు మాస్టారు ఈ ప్రాంత వాసి కావడం మన ప్రాంతానికి మంచి వరమన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే అనేక రచనలు ఆయన చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రత్నకుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న హెచ్‌ఎం నాగరాజు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎల్.నాగరాజు అన్నారు. పాఠశాలలో ఫేర్‌వేల్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ప్రణాళికతో చదివితే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

కురుపాం: మహిళా సంఘాలకు బ్యాంకులు ఇస్తున్న రుణాలు, లింకేజీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి క్లస్టర్ పరిధిలోని పొదుపు సంఘాలతో శుక్రవారం సమావేశమయ్యారు. సంఘాలకు సంబంధించి క్రెడిట్ యుటిలైజేషన్, క్యాష్ ఫ్లో స్టడీపై సమీక్షించారు. సంఘం పొదుపు, రుణాలు, ఆర్థిక పరిపుష్టిపై ఆరా తీశారు. రుణాలను ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నారని సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం కిశోర్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

పార్వతీపురం:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నిరసన చేపట్టింది. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు ప్రజావ్యతిరేకమైనవని విమర్శించారు. అటు రైతులు, ఇటు కార్మికులను ఇబ్బంది పెట్టేలా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ వారికి దేశ సంపదను అప్పగిస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం నిధులకు సంబంధించి, 37 నుంచి 25 శాతం నిధులను తగ్గించిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజావ్యతిరేక విధానాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వి.ఇందిర, జి.వెంకటరమణ, సూరిబాబు, ఉమామహేశ్వరరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: కలెక్టరు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



సీతానగరం: మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వరరావు

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊసేలేదని, విభజన హామీపై ఎటువంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. కనీస మద్దతు ధర ప్రకటించిన దాఖలాలు కూడా లేవన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు బడ్జెట్‌లో ఎటువంటి ప్రాధాన్యం కల్పించకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రమణమూర్తి, సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.